క్లుప్తంగా

ట్రాఫిక్ రూల్స్ పక్కాగా అమలుచేయాలి


ట్రాఫిక్ పోలీసులతో సమీక్షిస్తున్న ఎస్పీ దామోదర్

ఒంగోలు టౌన్: ట్రాఫిక్ రూల్స్ పక్కాగా అమలు చేయాలని, ప్రజలకు ఇబ్బంది కలగకుండా ట్రాఫిక్ క్రమబద్ధీకరించాలని ఎస్పీ దామోదర్ ట్రాఫిక్ పోలీసులను ఆదేశించారు. సోమవారం జిల్లా పోలీసు కార్యాలయంలో ట్రాఫిక్ పోలీసులతో సమీక్ష నిర్వహించారు. రోడ్డు ప్రమాదాల నివారణకు తరచూ డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు నిర్వహించాలని, ట్రాఫిక్ సిబ్బంది నిత్యం నగరంలో తిరుగుతూ ట్రాఫిక్ సమస్య తలెత్తకుండా చూడాలని చెప్పారు. ట్రాఫిక్ కేసుల వివరాలను అప్పటికప్పుడు రికార్డుల్లో నమోదు చేయాలన్నారు. విధి నిర్వహణలో ప్రతిభ చూపిన వారికి రివార్డులు ప్రకటించారు. కార్యక్రమంలో ట్రాఫిక్ సీఐ పాండురంగారావు, ట్రాఫిక్ ఎస్‌ఐలు కోటయ్య, నజీర్ బాష, శ్రీనివాసరావు, మాల్యాద్రి పాల్గొన్నారు.

రెడ్డినగర్లో మలేరియా మెడికల్ క్యాంప్

చీమకుర్తి రూరల్: మండలంలోని మంచికలపాడు పంచాయతీ రెడ్డినగర్లో బండ్లమూడి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారులు సోమవారం మలేరియా మెడికల్ క్యాంప్ నిర్వహించారు. మలేరియా సబ్ యూనిట్ ఆఫీసర్ శ్రీనివాసరావు పాల్గొనగా, డాక్టర్ సందీప్, వైద్య సిబ్బంది డోర్ టూ డోర్ సర్వే చేసి 70 మంది నుంచి రక్త నమూనాలు సేకరించి మలేరియా పరీక్ష చేశారు. మలేరియా కేస్ ఒకటి నిర్ధారణ అయింది. ఆరోగ్యం, పారిశుద్ధ్యంపై ప్రజలకు అవగాహన కల్పించారు. మంచికలపాడు పంచాయతీ కార్యదర్శి పద్మజ, కమ్యూనిటీ హెల్త్ అధికారి సీహెచ్ మాధవరావు తదితరులు పాల్గొన్నారు.

మాలధారులకు అన్నదానం

మద్దిపాడు: మాలధారులకు మద్దిపాడులో అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించినట్లు స్థానిక అయ్యప్పస్వామి ఆలయ అన్నదాన కమిటీ సభ్యులు తెలిపారు. కమిటీ ఆధ్వర్యంలో 41 రోజుల పాటు అన్నదానం చేయనున్నట్లు చెప్పారు. మాలధారులంతా పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

చెక్ బౌన్స్ కేసులో రెండేళ్ల జైలు

ఒంగోలు: చెక్‌బౌన్స్ కేసులో నిందితుడు తుపాకుల శ్రీనివాసరావుపై నేరం రుజువైనట్లు పేర్కొంటూ రెండు సంవత్సరాల జైలుశిక్ష విధిస్తూ ఎక్సైజ్ మేజిస్ట్రేట్ ఎస్.కోమలవల్లి సోమవారం తీర్పుచెప్పారు. 2014 మే 15న ఫిర్యాది చండిక నాగమల్లేశ్వరరావు వద్ద నుంచి తుపాకుల శ్రీనివాసరావు రూ.6,74,500 రుణం తీసుకుని ప్రామిసరీ నోటు రాసిచ్చాడు. 2015 నవంబరు 5న రూ.9,12,830కు చెక్కు ఇచ్చాడు. చెక్కును ఫిర్యాది బ్యాంకులో వేయగా చెల్లలేదు. దీంతో నాగమల్లేశ్వరరావు కోర్టును ఆశ్రయించగా, ఇరు పక్షాల వాదనల అనంతరం నిందితుడు శ్రీనివాసరావుపై నేరం రుజువైనట్లుగా పేర్కొంటూ 2 సంవత్సరాల జైలుశిక్ష, ఫిర్యాదికి రూ.18,25,660 చెల్లించాలని ఆదేశించారు.

ప్రకృతి సేద్యం వైపు రైతన్న అడుగులు

ఒంగోలు సిటీ: ప్రతి ఒక్కరికీ ఆరోగ్యకరమైన ఆహారం అందించే దిశగా రైతులు ఆసక్తి చూపడం శుభపరిణామమని ఏపీసీఎన్ఎఫ్ ప్రాజెక్టు మేనేజరు సుభాషిణి అన్నారు. సోమవారం ఒంగోలు మండలంలోని వలేటివారిపాలెం గ్రామంలో ప్రకృతి వ్యవసాయం చేస్తున్న రైతుల పంట పొలాలను పరిశీలించి సలహాలు, సూచనలు చేశారు. రసాయనాలు వాడటం తగ్గించి ప్రకృతి సేద్యం వైపు అడుగులు వేయాలన్నారు. ప్రకృతి సేద్యం చేయడం వల్ల తక్కువ ఖర్చుతో అధిక దిగుబడితో పాటు ఆరోగ్యకరమైన ఆహారం ప్రజలకు అందించవచ్చన్నారు. అనంతరం గ్రామంలో యూనిట్ ఇన్‌చార్జ్ సింగమనేని రాధ ఆధ్వర్యంలో 250 లీటర్ల అగ్ని అస్త్రం కషాయం తయారు చేశారు. వాకా మాధవి, వీపీఏ అక్ష, గ్రామరైతులు పాల్గొన్నారు.

వాహనాల తనిఖీ

సంతనూతలపాడు: స్థానిక ఆర్టీసీ బస్టాండ్ సెంటర్లో సోమవారం సాయంత్రం ఎస్సై అజయ్ బాబు ఆధ్వర్యంలో వాహనాలను పోలీసులు తనిఖీ చేశారు. లైసెన్స్‌లు, పత్రాలు లేని వాహనదారులకు పెనాల్టీలు విధించారు.

హ్యూమన్ రైట్స్ ఒంగోలు అధ్యక్షుని నియామకం

ఒంగోలు మెట్రో: హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా ఒంగోలు సిటీ అధ్యక్షునిగా డాక్టర్ లంకా ప్రసన్నకుమార్ నియమితులయ్యారు. ఆ మేరకు సంస్థ ప్రధాన కార్యాలయం నుంచి సోమవారం ఉత్తర్వులు అందుకున్నారు. సంవత్సరం పాటు కొనసాగుతారని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

మహామాయ కామాఖ్య పుస్తకం ఆవిష్కరణ

ఒంగోలు మెట్రో: స్థానిక శ్రీరమణ ఆధ్యాత్మిక కేంద్రంలో ముక్తినూతలపాటి మారుతీ వెంకట సుబ్రహ్మణ్యం రచించిన మహామాయ కామాఖ్య పుస్తకాన్ని రమణ కేంద్రం అధ్యక్షుడు కొప్పోలు హనుమంతరావు సోమవారం ఆవిష్కరించారు. ప్రకాశం జిల్లా రచయితల సంఘ అధ్యక్షుడు పొన్నూరు శ్రీనివాసులు, ఏబీఎం కళాశాల విశ్రాంత ప్రిన్సిపాల్ పింగళి పాండురంగారావు, లెక్చరర్ కొప్పోలు ఫణిరాజు, విశ్రాంత హెచ్‌ఎం గుడ్లూరు రామచంద్రరావు, పాల్గొన్నారు.

ఉద్యానవన పంటల ఊసేది..?


సాగులో ఉన్న చామదుంప పంట


చిలకడదుంప పంట...

- ప్రభుత్వం ఇచ్చే ఆర్థిక సహాయం కనుమరుగు
- ప్రోత్సాహం లేక తగ్గిపోతున్న సాగు
- ఆదుకోవాలని రైతుల డిమాండ్
- కొత్తపట్నం మండలంలో 1,285 ఎకరాల్లో ఉద్యానవన పంటల సాగు

కొత్తపట్నం:

ఉద్యానవన రైతులను ప్రభుత్వం పూర్తిగా గాలి కొదిలేసింది. వారికి అందాల్సిన పథకాలు ఇస్తున్న దాఖలాలు కనిపించడం లేదు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ఖరీఫ్ సీజన్ పోయి రబీ సీజన్ వచ్చినప్పటికీ ఉద్యానవన రైతుల గురించి నేటికీ పట్టించుకోలేదు. గత ప్రభుత్వాలు ఉద్యానవన పంటలకు ఎన్నో పథకాలు అమలు చేసి సదుపాయాలు కల్పించి రైతులను ప్రోత్సహించి ఆదుకుంది. ప్రస్తుత కూటమి ప్రభుత్వంలో ఉద్యానవన రైతుల ప్రస్తావనే లేదు. కొత్తపట్నం మండలంలోని 15 గ్రామాల్లో 5 ఎకరాల్లోపు ఉన్న చిన్న, సన్నకారు రైతులు ఎంతో మంది ఉన్నారు. ప్రధాన పంటలైన చామదుంప, చిలకడదుంప, మిర్చి, పువ్వులు, కూరగాయలు, నిమ్మ, సుగంధ ద్రవ్యాలు, తీగ జాతి పంటలైన బీర, సొర, చిక్కుడు, అలసంద వివిధ రకాల ఉద్యానవన పంటలు సాగు చేస్తున్నారు. సుమారు 1,285 ఎకరాల్లో వీటిని సాగు చేస్తున్నారు. ఇసుక ప్రాంతం కావడంతో బోర్ల నుంచి నీరు ఎల్లప్పుడూ వచ్చే అవకాశం ఉంది. అందువలన ఏడాది మొత్తం ఉద్యానవన సంటలు పండిస్తూనే ఉంటారు. తక్కువ భూమి ఉన్నప్పటికీ పంటలు పండించి దూరప్రాంతాలకు తీసుకెళ్లి వ్యాపారం చేసి ఎక్కువ లాభం ఆర్జిస్తారు.

ఏఈపీ, ఏఐడీపీ పథకాల నిధులు శూన్యం...
ఏఈపీ, ఏఐడీపీ నుంచి నిధులు పూర్తిగా బందయ్యాయి. వాటి నుంచి రైతులకు సాయం అందడం లేదు. ప్రభుత్వం నుంచి ఉద్యానవన పంటలకు నిధులు కేటాయించకపోవడంతో రైతుల పరిస్థితి అగమ్యగోచరంగా ఉంది. గతంలో చామదుంప సాగుకు ఏఈపీ పథకం ద్వారా రూ.12 వేల నగదును రైతుల అకౌంట్‌లో జమచేసేవారు. కూరగాయల సాగుకు హెక్టారుకు రూ.20 వేలు, వివిధ రకాల పువ్వుల సాగుకు రూ.16 వేలు, తీగజాతి పందెళ్లకు లక్ష రూపాయలను సబ్సిడీ కింద అందించేవారు. ప్రస్తుతం ఈ పథకాలను అమలు చేస్తున్న దాఖలాలే లేవు.

ఉద్యానవన పంటలన్నింటికీ సబ్సిడీ నిధులివ్వాలి...
తీర ప్రాంతంలో పండించే ఉద్యానవన పంటలన్నింటికీ సబ్సిడీ నిధులు ఇవ్వాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు. కొన్ని పంటలను మాత్రమే గుర్తించి ప్రభుత్వం సబ్సిడీ నిధులు ఇస్తోంది. అన్ని పంటల జాబితా తయారు చేసి నిధులు ఇవ్వాలని రైతులు కోరుతున్నారు. అంతేగాకుండా ఆన్‌లైన్‌లో నమోదు కాని పంటలను కూడా గుర్తించి సబ్సిడీ వచ్చే విధంగా చర్యలు తీసుకోవాలంటున్నారు. వీటన్నింటినీ పరిశీలించి ఉద్యానవన పంటలు సాగు చేసే రైతులందరినీ ఆదుకోవాలని కోరుతున్నారు.

మండలంలో ఒకే ఒక్క వీహెచ్‌ఏ...
ఉద్యానవన శాఖ నుంచి మండలానికి ఒకే ఒక్క వీహెచ్‌ఏ ఉద్యోగి ఉండటంతో కనీస సేవలు కూడా అందక రైతులు ఇబ్బంది పడుతున్నారు. మండలంలో 15 గ్రామ పంచాయతీలుంటే ఒకే ఒక్క వీహెచ్‌ఏ ఉండటం వలన ఉద్యానవన పంటలపై అవగాహన సదస్సులు లేక సాగులో కొంత మంది రైతులు నష్టపోతున్నారు. ప్రభుత్వం నుంచి వచ్చే రాయితీలు, పథకాలు రైతులెవరికీ తెలియడం లేదు. కనీసం మండలానికి నలుగురు వీహెచ్‌ఏలు ఉండాలని రైతులు అంటున్నారు.


బంతి పూల తోట


మిర్చి పంట

> **చామదుంప సాగుకు ఆర్థికసాయం ఇవ్వడం లేదు :**
> పూలు సాగు చేసే తీరప్రాంత రైతుల నుంచి కొన్ని పేర్లు పంపించాం. నగదు రాగానే వారిపేర్లమీద జమచేస్తాం. చామదుంప పంటకు ఇంతకుముందు సాయం అందించేవారు. ప్రస్తుతం తీసివేశారు. ప్రభుత్వం అమలుచేస్తే అందిస్తాం. కూరగాయల సాగుకు సబ్సిడీపై గతంలో హెక్టారుకు రూ.16 వేలు అందించేవారు. ఇప్పుడు నారు కొనుగోలు చేసి ఇవ్వడానికి మాత్రమే ఇస్తూ కొత్త పద్ధతి పెట్టారు. ఆ మేరకు జాబితా తయారు చేసి పంపిస్తాం.
>
> తేజ, హార్టీకల్చర్ ఆఫీసర్

> **ఉద్యానవన పంటలను పట్టించుకోవడం లేదు :**
> 
> నేను ఒక ఎకరాలో చిలకడదుంప సాగు చేశా. ఎకరాకు రూ.40 వేల నుంచి రూ.50 వేలు ఖర్చవుతోంది. నేను పంట వేసి కూడా నాలుగు రోజులవుతోంది. గతంలో ప్రభుత్వం ఉద్యానవన పంటలకు పంటను బట్టి ఎంతో కొంత పెట్టుబడి సాయం అందించేది. కానీ, ఈ ఏడాది ఇంత వరకు పట్టించుకోలేదు. పథకాలు వచ్చే విధంగా చర్యలు తీసుకోవాలని కోరుకుంటున్నాను
>
> బలగాని రామ్‌మోహన్, గమళ్లపాలెం


> **ఉద్యానవన పంటలకు నిధులు విడుదల చేయాలి :**
> 
> చామదుంప పంటకు గతంలో కొంత మందికి హెక్టారుకు రూ.12 వేలు ఇచ్చేవారు. పెట్టుబడికి వచ్చేవి. వీటితో పాటు మేము కొంత పెట్టుబడి పెట్టుకుని సాగుచేసుకునేవాళ్లం. కానీ, ఇప్పుడు చామదుంప రైతులను పట్టించుకోవడంలేదు. నేను రెండున్నర ఎకరాలో పంట సాగుచేస్తున్నా. పెట్టుబడి లేక అప్పులు తెచ్చుకుని సాగుచేస్తున్నా. ప్రభుత్వం పరిశీలించి ఉద్యానవన రైతులను ఆదుకుని నిధులు కేటాయించాలని కోరుకుంటున్నా.
>
> వడ్లమూడి నరసింహారావు, రాజుపాలెం

> **పూల సాగు రైతులనూ ఆదుకోవాలి :**
> 
> పూల సాగు చేసే రైతులకు గతంలో హెక్టార్‌కు రూ.16 వేలను పెట్టుబడి సాయంగా ఇచ్చేవారు. ఇప్పుడు అసలు ఇవ్వడం లేదు. మేము చిన్న, సన్నకారు రైతులం. పూల సాగు మీదే ఆధారపడి జీవిస్తున్నాం. కానీ, ప్రభుత్వం పూల సాగు రైతులను పట్టించుకోవడం లేదు. మాకు కూడా నిధులు కేటాయించి ప్రభుత్వం ఆదుకోవాలి.
>
> బక్కా రామలింగారెడ్డి, ఈతముక్కల

సత్వర చికిత్సే శ్రీరామరక్ష

- బ్రెయిన్ స్ట్రోక్‌పై వైద్య నిపుణుల సూచన
- నేడు బ్రెయిన్ స్ట్రోక్ డే

ఒంగోలు టౌన్: బ్రెయిన్ స్ట్రోక్ బాధితుల సంఖ్య రోజురోజుకూ పెరిగిపోతోంది. బ్రెయిన్ స్ట్రోక్‌ను సామాన్యుల పరిభాషలో పక్షవాతం అంటారు. దీని బారిన పడిన వారి జీవితం దుర్భరం అవుతుంది. ఒకచేయి, ఒకకాలు పనిచేయకపోవడం, మాట రాకపోవడం లాంటి వాటితో ఇబ్బంది పడుతుంటారు. మారిన జీవనశైలి, మానసిక ఒత్తిడి, ఉప్పు ఎక్కువగా ఉన్న ఆహారం తీసుకోవడం, ధూమపానం, మద్యపానం అలవాట్ల వలన బ్రెయిన్ స్ట్రోక్ బారిన పడుతున్న వారి సంఖ్య విపరీతంగా పెరుగుతోంది. మెదడులో రక్తం గడ్డకట్టడం, అధిక రక్తపోటు, కొలెస్ట్రాల్ తదితర కారణాల వలన కూడా బ్రెయిన్ స్ట్రోక్ వస్తుందని వైద్యులు చెబుతున్నారు. మానసిక ఒత్తిడికి గురైన వారిలో మెదడులో రక్తం గడ్డకడుతుంది. దీనివలన మెదడులో రక్త ప్రసరణ సరిగా జరగదు. బీపీ అదుపులో లేకుండాపోవడంతో మెదడులోని నరాలలో రక్తస్రావం జరుగుతుంది. దీని వలన పక్షవాతం వస్తుంది. 18 నుంచి 40 ఏళ్ల వయసు కలిగిన వారు వెంటనే మద్యం, ధూమపానం అలవాట్లను మానివేయం మంచిదని వైద్యులు సూచిస్తున్నారు. ఒంగోలులోని ప్రభుత్వ సర్వజన ఆస్పత్రిలో ఇందుకోసం ప్రత్యేక వైద్యం అందుబాటులో ఉంది. ప్రతిరోజూ ఇక్కడకు వైద్యం కోసం రెండంకెల్లో రోగులు వస్తున్నారు. బ్రెయిన్‌లో రక్తం గడ్డకట్టిన వారికి ఆపరేషన్లు కూడా చేస్తున్నారు. ప్రతి నెలా 200కుపైగా జీజీహెచ్‌లో శస్త్ర చికిత్సలు చేస్తున్నారు. బ్రెయిన్ స్ట్రోక్‌కు సత్వర చికిత్సే శ్రీరామరక్ష అని వైద్యులు చెబుతున్నారు.



> **బ్రెయిన్ స్ట్రోక్ లక్షణాలు...**
> - ముహం, చేయి, కాలు తదితర భాగాలలో తిమ్మిరి. ఆయా భాగాలు బలహీనంగా అనిపించడం..
> - ఒక కన్ను లేదా రెండు కళ్లలో ఆకస్మికంగా చూపు మందగించడం..
> - ఆకస్మికంగా మాటలు తడబడటం. మాట్లాడేటప్పుడు మూతి వంకర పోవడం. మాటలో తేడా స్పష్టంగా కనిపించడం..
> - ఉన్నట్టుండి ఒక్కసారిగా భరించలేని తలనొప్పి..
> - మైకం వచ్చినట్లు మనిషి నడకలో మార్పు. నడవడానికి ఇబ్బంది పడటం..

గోల్డెన్ అవర్‌లో చికిత్స చేయడం ప్రధానం...
పక్షవాతం వచ్చిన వారిని ఎంత త్వరగా వీలైతే అంత త్వరగా వైద్యశాలకు తరలించాలి. దీనినే గోల్డెన్ అవర్ అంటారు. మనిషికి స్ట్రోక్ వచ్చిన తర్వాత ప్రతి నిముషం అత్యంత విలువైందని గుర్తించాలి. తక్షణమే పక్షవాతానికి చికిత్స చేయకపోతే మెదడు శాశ్వతంగా దెబ్బతినే ప్రమాదం ఉంది. ఈ రోగులను సకాలంలో గుర్తించడం వలన ఎఫ్ఏఎస్‌టీ అనే విధానం ద్వారా చికిత్స చేస్తారు. దీని వలన ప్రాణాపాయం నుంచి రక్షించవచ్చు. మెదడు దెబ్బతినకుండా కాపాడవచ్చు. సాధ్యమైనంత త్వరగా చికిత్సకు తీసుకెళ్తే అల్ట్‌ప్లెస్, లేదా టెనెక్ట్‌ప్లెస్‌తో థ్రోంబోలైటిక్ చికిత్స చేసి మెదడులో రక్తం గడ్డకట్టకుండా చేస్తారు. మరికొంత మందికి మెకానికల్ థ్రోంబెక్టమీ చికిత్స అందించి ప్రాణాపాయం నుంచి కాపాడతారు. అయితే, పక్షవాతం వచ్చే ముందు కొన్ని లక్షణాలు కనిపిస్తాయి. వాటిమీద అవగాహన కలిగి ఉండాలి.

బ్రెయిన్ స్ట్రోక్‌కు ఆధునిక చికిత్స

బ్రెయిన్ స్ట్రోక్ బారిన పడిన వారిని ఆలస్యం చేయకుండా ఆస్పత్రికి తరలించి వైద్యం అందించాలి. ఇప్పుడు అల్లోపతి వైద్యంలో ఎంతో మెరుగైన చికిత్స ఉంది. మెదడులో రక్తం గడ్డకట్టినప్పటికీ క్షణాల్లో కరిగించే వైద్యం అందుబాటులో ఉంది. ఆలస్యమయ్యేకొద్దీ రోగి మరింత ప్రమాదంలో పడతాడు. చికిత్స కూడా కష్టతరమవుతుంది. ఒక్కోసారి ప్రాణాలు కూడా కోల్పోయే ప్రమాదం ఉంది. అంతకంటే ముందుగా వయసుతో నిమిత్తం లేకుండా మద్యపానం, ధూమపానం అలవాట్లను మానుకోవాలి. ఒత్తిళ్లకు దూరంగా ప్రశాంతంగా జీవించాలి. రక్తపోటు ఉన్నవారు అదుపులో ఉంచుకోవాలి.

– డాక్టర్ కె.అనిల్ కుమార్, న్యూరాలజిస్టు

కెనరా బ్యాంక్ సేవలతో ఆర్థికాభివృద్ధి

కొత్తపట్నం: గ్రామీణ ప్రాంత ప్రజలు కెనరా బ్యాంక్ సేవలు వినియోగించుకోవడం ద్వారా ఆర్థికంగా ఎదుగుతారని కొత్తపట్నం కెనరా బ్యాంక్ మేనేజర్ విక్రమ్ అన్నారు. అక్టోబర్ 31న కెనరా బ్యాంక్ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా కొత్తపట్నం కెనరా బ్యాంక్ ఆవరణలో ఖాతాదారులతో సోమవారం సమావేశం నిర్వహించి మాట్లాడారు. రుణాలు, పథకాల గురించి వివరించారు.

అర్ధరాత్రి డీజేలు పెడితే కఠిన చర్యలు

ఒంగోలు టౌన్: అర్ధరాత్రి డీజేలు పెట్టినా, నడిరోడ్డుపై బర్త్ డే కేకులు కట్‌చేసి గొడవలు చేసినా సహించేది లేదని, చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని ఒంగోలు డీఎస్పీ రాయపాటి శ్రీనివాసరావు హెచ్చరించారు. ఆ మేరకు సోమవారం ప్రకటన విడుదల చేశారు.

6 నుంచి ఫొటోగ్రఫీ, వీడియోగ్రఫీలో ఉచిత శిక్షణ

ఒంగోలు వన్‌టౌన్: ఒంగోలు రూడ్‌సెట్ ఆధ్వర్యంలో ఈ నెల 6వ తేదీ నుంచి నెల రోజుల పాటూ ఫొటోగ్రఫీ, వీడియోగ్రఫీలో ఉచిత శిక్షణ అందిస్తున్నట్లు ఆ సంస్థ డైరెక్టర్ శ్రీనివాసరెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. 18 నుంచి 45 సంవత్సరాల్లోపు అర్హులైన యువతీ, యువకులు తమ పూర్తి వివరాలతో పేర్లు నమోదు చేసుకోవాలన్నారు. ఉచిత శిక్షణ కాలంలో ఉచిత భోజన, వసతి సదుపాయాలు ఉంటాయన్నారు. ఆసక్తి ఉన్న అభ్యర్థులు ఇతర పూర్తి వివరాలకు 9573363141 నంబర్‌ను సంప్రదించాలన్నారు.

నేడు మెప్మా అర్బన్ మార్కెట్ ప్రారంభం

ఒంగోలు సిటీ: స్థానిక అద్దంకి బస్టాండ్ వద్ద మెప్మా అర్బన్ మార్కెట్‌ను మంగళవారం ప్రారంభించనున్నట్లు మెప్మా ప్రాజెక్టు డైరెక్టర్ తేళ్ల రవికుమార్ సోమవారం తెలిపారు. ఈ నెల 29, 30 తేదీల్లో ఉదయం 10 నుంచి సాయంత్రం 6 గంటల వరకు కొనసాగుతుందని చెప్పారు.

విజయంతో తిరిగిరావాలి

- ఏకేయూ టీంను ఆశీర్వదించిన వీసీ, రిజిస్ట్రార్


కబడ్డీ క్రీడాకారులతో వీసీ మూర్తి, రిజిస్ట్రార్ హరిబాబు

ఒంగోలు సిటీ: ఈ నెల 30 నుంచి నవంబర్ 4వ తేదీ వరకు చెన్నైలోని ఎస్.ఆర్.ఎం.యూనివర్సిటీలో జరగబోయే ఇంటర్ యూనివర్సిటీ కబడ్డీ టోర్నమెంట్‌లో పాల్గొనే ఆంధ్రకేసరి యూనివర్సిటీకి చెందిన 12 మంది క్రీడాకారులు సోమవారం వీసీ డీవీఆర్ మూర్తి, రిజిస్ట్రార్ హరిబాబును కలిసి ఆశీర్వచనాలు తీసుకున్నారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ క్రీడాకారులు ప్రతిభ చూపి విజయం సాధించాలని ఆకాంక్షించారు. గెలుపోటములు సహజమైనప్పటికీ సమష్టి కృషితో రాణించాలని రిజిస్ట్రార్ హరిబాబు సూచించారు. కార్యక్రమంలో ఏకేయూ ఫిజికల్ ఎడ్యుకేషన్ విభాగం డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ ఐ.దేవీవరప్రసాద్, సెలక్షన్ కమిటీ సభ్యులు, ఉలవపాడు డిగ్రీ కళాశాల పీడీ గంటా సాయికుమార్ పాల్గొన్నారు.

వ్యాధులపై విద్యార్థులకు అవగాహన అవసరం


విద్యార్థులనుద్దేశించి ప్రసంగిస్తున్న డీపీఎంఓ వరప్రసాద్

మద్దిపాడు: కుష్టు వ్యాధి, సీజనల్ వ్యాధులపై మండలంలోని ఇనమనమెళ్లూరు పాఠశాలలో విద్యార్థులకు సోమవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. పీహెచ్‌సీ సూపర్‌వైజర్ బాలకోటయ్య ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా డీపీఎంఓ వరప్రసాద్ పాల్గొని మాట్లాడారు. కుష్టు వ్యాధి నయం చేయదగిన వ్యాధి అని, దానిని తొలిదశలోనే గుర్తిస్తే వెంటనే వ్యాధి సోకకుండా నివారించడం సులువుగా ఉంటుందని అన్నారు. విద్యార్థులకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించడంలో ముఖ్య ఉద్దేశం ఇంటి వద్ద పెద్దలకు చెప్పి వారికి కూడా అవగాహన కల్పిస్తారని, తద్వారా కుష్టు వ్యాధిని నిర్మూలించడానికి అవకాశం ఉంటుందని ఆయన అన్నారు. స్పర్శలేని రాగి రంగు మచ్చలు వంటిపై ఉంటే కుష్టు వ్యాధిగా భావించవచ్చన్నారు. అటువంటి వారి గురించి వెంటనే సమీపంలో ఉన్న ఆశా వర్కర్లకు తెలియజేస్తే వారికి సరైన చికిత్స అందించి వెంటనే నయమయ్యే విధంగా మందులు ఉన్నాయని తెలిపారు. నీటి ద్వారా, దోమల ద్వారా వచ్చే పలు రకాల జ్వరాలు, వ్యాధుల గురించి విద్యార్థులకు వివరించారు. ఇంటి పరిసరాలలో మురుగునీరు నిల్వ లేకుండా చూసుకోవాలని, కాలనీల సమీపంలో చెత్త వేయకుండా చూసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం నాగకల్యాణి, ఇతర ఉపాధ్యాయులు, సూపర్‌వైజర్ బాలకోటయ్య, ఏఎన్ఎం శైలజ, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

ఇనమనమెళ్లూరు ఎస్సీకాలనీలో ఎబేట్ చల్లించిన వైద్యశాఖ సిబ్బంది...
ఇనమనమెళ్లూరు ఎస్సీకాలనీలో వైద్యశాఖ సిబ్బంది మురుగునీటి కాల్వల్లో దోమ లార్వా పెరగకుండా ఎబేట్ చల్లించారు. కాలనీలో నీరు నిల్వ ఉన్న చోట ఆయిల్ బాల్స్ వేశారు.

వెల్లంపల్లిలో ఫాగింగ్...
మండలంలోని వెల్లంపల్లిలో వైద్యశాఖ సిబ్బంది దోమల నివారణకు ఫాగింగ్ నిర్వహించారు. ఎంపీటీసీ దుర్గాభవానీ, సర్పంచ్ అనిల్, గ్రామ కార్యదర్శి మాధవి పాల్గొన్నారు.

నిబంధనల ప్రకారమే బాణసంచా విక్రయించాలి

- ఎస్పీ దామోదర్

ఒంగోలు టౌన్: నిబంధనల ప్రకారమే బాణసంచా విక్రయించాలని, ప్రభుత్వ నిబంధనలను అతిక్రమించి టపాసులు విక్రయించినా, నిల్వ చేసినా చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని ఎస్పీ ఏఆర్ దామోదర్ హెచ్చరించారు. ఆ మేరకు సోమవారం ప్రకటన విడుదల చేశారు. జిల్లాలో బాణసంచా విక్రయాలు, తయారీదారులు పేలుడు పదార్థాలను ఇంట్లో ఉంచరాదన్నారు. శాశ్వత, తాత్కాలిక బాణసంచా తయారీ, విక్రయదారులు లైసెన్సు కలిగిన దుకాణాల్లోనే విక్రయించాలని స్పష్టం చేశారు. బహిరంగ ప్రదేశాలలో నిర్ణీత కొలతల మేరకు ప్రత్యేక దుకాణాలు ఏర్పాటు చేసుకోవాలని, దుకాణాల వద్ద మండే స్వభావం కలిగిన వస్తువులు ఉంచరాదని తెలిపారు. నీరు, ఇసుక, తదితర అగ్నిమాపక సామగ్రిని తప్పనిసరిగా సిద్ధంగా ఉంచుకోవాలన్నారు. మీ పరిసరాలలో జాగ్రత్తలను సూచిస్తూ బోర్డులు ఉంచాలని, చిన్న పిల్లలను బాణసంచా విక్రయదుకాణాలలో పనికి పెట్టుకోరాదని తెలిపారు. బాణసంచా దుకాణాలకు దూరంగా వాహనాలను పార్కింగు చేసుకునేలా ఏర్పాటు చేసుకోవాలని, ఎలాంటి ప్రమాదాలకు తావులేకుండా సరైన భద్రతా ప్రమాణాలు పాటించాలని సూచించారు. జిల్లాలో అక్రమంగా టపాసులు సరఫరా చేయడం, విక్రయాలు చేయడం లాంటి వాటిపై నిఘా ఉంచాలని అధికారులను ఆదేశించారు. నిరంతర తనిఖీలు నిర్వహించాలని, ముందస్తు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని సూచించారు. టపాసులు కాల్చే సమయంలో కాటన్ దుస్తులు ధరించాలని, సిల్క్ వస్త్రాలు ధరించవద్దని అన్నారు. ప్రజలకు, రోడ్డు వెంట వెళ్లే వాహనాలకు ఇబ్బందులు కలగకుండా టపాసులు కాల్చాలన్నారు. పిల్లలు టపాసులు కాల్చే సమయంలో పెద్దలు పర్యవేక్షించాలని ఎస్పీ సూచించారు.

ఎరువులతో పురుగు మందులకు పొంతన పెడితే చర్యలు


ఉప్పుగుండూరులో ఎరువుల దుకాణాన్ని పరిశీలిస్తున్న ఏవో వెంకట్రావు

నాగులుప్పలపాడు: పురుగు మందులు, మైక్రో న్యూట్రియంట్స్ కొనుగోలు చేస్తేనే ఎరువులు ఇస్తామని రైతులకు లింకు పెడితే అలాంటి ఎరువుల దుకాణాలపై చర్యలు తప్పవని మండల వ్యవసాయాధికారి వెంకట్రావు హెచ్చరించారు. సోమవారం ఉప్పుగుండూరులోని ఎరువుల దుకాణాన్ని పరిశీలించిన ఏవో.. అక్కడి సిబ్బందితో మాట్లాడి రైతులకు అవసరమైన మేరకే ఎరువులు ఇవ్వాలని, అలా కాకుండా అధిక ఎరువులు బలవంతంగా అంటగడితే చర్యలు తీసుకుంటామని తెలిపారు. అలాగే మండలంలో ఎక్కడా డీఏపీ కొరత లేదని, రైతు సేవా కేంద్రాల ద్వారా కూడా సరఫరా చేస్తున్నామని తెలిపారు. అనంతరం దుకాణంలో స్టాకు రిజిష్టర్లు, బిల్లులు తనిఖీ చేశారు. ప్రతి ఎరువుల దుకాణంలో తప్పకుండా స్టాకు నిల్వ, ధర వివరాల బోర్డు తప్పకుండా ఉండేలా చూడాలని తెలిపారు.

ఉచిత సిలిండర్లను పారదర్శకంగా సరఫరా చేయాలి

- జాయింట్ కలెక్టర్ గోపాలకృష్ణ

ఒంగోలు అర్బన్: పౌరసరఫరాల శాఖ గుర్తించిన అర్హులైన లబ్ధిదారులకు ఏడాదికి మూడు ఉచిత గ్యాస్ సిలిండర్లను పారదర్శకంగా సరఫరా చేయాలని జాయింట్ కలెక్టర్ గోపాలకృష్ణ అధికారులను ఆదేశించారు. సోమవారం ప్రకాశం భవనంలో పౌరసరఫరాల శాఖ అధికారులతో సమావేశం నిర్వహించారు. లబ్ధిదారులు చెల్లించిన మొత్తాన్ని ప్రభుత్వం తిరిగి లబ్ధిదారుడి ఆధార్‌తో అనుసంధానమైన బ్యాంకు ఖాతాకు నేరుగా 24 గంటల్లో జమ చేస్తుందని తెలిపారు. దీపం పథకం-2 కింద పేదవారికి ప్రభుత్వం ఏడాదికి మూడు ఉచిత గ్యాస్ సిలిండర్లు అందజేయాలని నిర్దేశించిందన్నారు. గ్యాస్ కనెక్షన్ యాక్టివ్‌లో ఉండి ఆధార్, రైస్ కార్డు ఉన్న వినియోగదారులకు ఉచిత గ్యాస్ సిలిండర్లు సరఫరా చేయడం జరుగుతుందన్నారు. మొదటి విడతగా ఈ నెల 29 నుంచి మార్చి 31వ తేదీ వరకు ఐదు నెలల కాలంలో ఉచిత సిలిండర్ బుక్ చేసుకోవచ్చని తెలిపారు. ఆ తర్వాత ఏప్రిల్ నుంచి జూలై వరకు తొలి విడత సిలిండర్, ఆగస్టు నుంచి నవంబర్ వరకు రెండో సిలిండర్, డిసెంబర్ నుంచి మార్చి వరకు మూడో సిలిండర్ పొందవచ్చని తెలిపారు. ఆన్‌లైన్ లేదా గ్యాస్ ఏజెన్సీల ద్వారా సిలిండర్ బుక్ చేసుకోవచ్చని తెలిపారు. లబ్ధిదారులకు సమాచారం కోసం టోల్ ఫ్రీ నంబర్ 1967ను సంప్రదించాలని తెలిపారు. సమావేశంలో డీఎస్ఓ పద్మశ్రీ, సహాయ పౌరసరఫరాల అధికారి పుల్లయ్య, సేల్స్ అధికారులు మోహన్‌రావు, భాస్కర్ లింగరావు, గ్యాస్ ఏజెన్సీల డీలర్లు పాల్గొన్నారు.

జాతీయస్థాయి యోగా పోటీలకు ట్రిపుల్ ఐటీ విద్యార్థులు

సంతనూతలపాడు: స్థానిక ట్రిపుల్ ఐటీ విద్యార్థులు ఈ నెల 26, 27 తేదీల్లో కర్నూలు జిల్లా నంద్యాలలో జరిగిన ఆంధ్రప్రదేశ్ యోగా అసోసియేషన్ పోటీల్లో ప్రతిభ చూపి జాతీయస్థాయి యోగా పోటీలకు ఎంపికయ్యారు. 18, 21 సంవత్సరాల పురుషుల విభాగంలో కె.భరత్ కుమార్‌రెడ్డి ప్రథమ స్థానంలో నిలిచి గోల్డ్ మెడల్, షేక్ సిద్ధసాయిబాబా రెండో స్థానంలో నిలిచి సిల్వర్ మెడల్ సాధించి జాతీయస్థాయి డిసెంబర్ 28 నుంచి 30వ తేదీ వరకు జార్ఖండ్ రాష్ట్రం ధన్‌బాద్లో జరగబోయే పోటీలకు ఎంపికవడంతో ట్రిపుల్ ఐటీ ఒంగోలు డైరెక్టర్ భాస్కర్ పటేల్, ఏఓ ఎన్.చంద్రశేఖర్, డీన్ రూపాస్ కుమార్, ఫైనాన్స్ ఆఫీసర్ మీరావలి, డీన్ సురేష్‌బాబు, ఫిజికల్ డైరెక్టర్ పీవీ భాస్కర్, యోగా శిక్షకుడు పగడాల చంద్రశేఖర్, నాన్ టీచింగ్ సిబ్బంది అభినందించారు.

అగ్గిపెట్టె ఇవ్వలేదని దుకాణం ధ్వంసం

ఒంగోలు టౌన్: అగ్గిపెట్టె ఇవ్వలేదన్న కోపంతో కూరగాయల కొట్టు మీద దాడికి దిగాడు ఒక రౌడీషీటర్. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. ఒంగోలు నీలాయపాలేనికి చెందిన నీలం గీతాంజలి నగరంలోని గోపాల్‌నగర్ 3వ లైనులోని వెంకటేశ్వరస్వామి దేవాలయం వద్ద దుకాణం పెట్టుకుని కూరగాయలు విక్రయిస్తోంది. ఈ నెల 19వ తేదీ సాయంత్రం అదే ప్రాంతానికి చెందిన రౌడీషీటర్ అద్దేటి గోపి వచ్చి అగ్గిపెట్టె అడిగాడు. డబ్బులిస్తే అగ్గిపెట్టె ఇస్తానని చెప్పడంతో ఆగ్రహానికి గురైన గోపి దుకాణాన్ని ధ్వంసం చేశాడు. ఆమె అంతుచూస్తానంటూ చాతిమీద చేయేసి నెట్టాడు. గల్లాపెట్టెలో డబ్బు తీసుకున్నాడు. గీతాంజలి కుటుంబ సభ్యులను కూడా కులం పేరుతో దూషించాడు. బాధితురాలి ఫిర్యాదుతో సోమవారం అట్రాసిటీ కేసు నమోదు చేసినట్లు సీఐ శ్రీనివాసరావు తెలిపారు.